





# కలెక్టర్‌కు సవాల్‌గా సిగాచి!

## విపత్తును ఎదిరించిన కలెక్టర్ ప్రావీణ్య



**(పటాన్‌చెరు-సిరిన్యూస్):** జూన్ నెల 13న సంగారెడ్డి జిల్లా కొత్త కలెక్టర్‌గా ప్రావీణ్య బాధ్యతలు తీసుకున్నారు. కలెక్టర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత జిల్లా పరిస్థితిని సంపూర్ణంగా తెలుసుకునేందుకు సమీక్షలు ప్రారంభించారు. ఒక్కోశాఖతో సమీక్ష నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నారు. సగం శాఖలతో సమీక్షలు కూడా పూర్తికాకుండానే సిగాచి పరిశ్రమ రూపంలో పెను విపత్తు ఆమె ముందుకు వచ్చింది. 20 రోజుల్లోనే ఐఏఎస్ అధికారి పనితీరు ఎలా ఉంటుందో జిల్లా ప్రజలకు, అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య పనితీరుతో అర్థమయింది. క్లిష్ట సమయంలో నిద్రహారాలు మాని, అంకిత భావంతో, ధైర్య సాహసాలతో సిగాచి విపత్తును ఎదురుకున్నారని ప్రశంసలు వస్తున్నాయి. సిగాచీ ప్రమాదం వివరాలు తెలియగానే తొలి గంటలోనే ప్రమాదస్థలికి కలెక్టర్ చేరుకోవడం విశేషం. ఒక వైపు అతీ పెద్ద అగ్నిప్రమాదం. మరో వైపు దాంట్లో చిక్కుకున్న కార్మికులను సిబ్బందిని కాపాడడం పెద్ద చాలెంజ్‌గా మారింది. తీవ్రమైన అగ్ని, కెమికల్స్ తో ప్రమాదం మరింత విస్తరించే అవకాశం ఉండడాన్ని పసిగట్టి యుద్ధ ప్రాతిపదికన అన్ని రంగాల అధికారులను, విపత్తు నివారణ బృందాలను రంగంలోకి దించారు. అగ్నిమాపక దళాలు పెద్ద ఎత్తున రంగంలోకి దిగి మంటలు మరింతగా వ్యాపించకుండా అరికట్టే ప్రయత్నంలో ఉండగానే స్థానికులు, ప్రమాదాన్ని చూడడానికి భారీగా తరలిరావడంతో ప్రజలను విష రసాయనాల నుంచి కాపాడేందుకు పోలీసుల సహాయంతో అక్కడి నుంచి తరలించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేసి పరిశ్రమ సమీపంలోకి ఎవరు రాకుండా తక్షణ చర్యలు తీసుకున్నారు. అదే సమయంలో పెద్ద ఎత్తున అంబులెన్సులను రప్పించి క్షతగాత్రులను కాపాడిన కార్మికులను అక్కడి నుంచి తరలించారు. అగ్నిమాపక బృందాలు సరిపోకపోతే దగ్గర్లోని ఫైర్ స్టేషన్ల నుంచి, నగరం నుంచి ప్రత్యేకంగా ఫైర్ ఇంజన్స్ రప్పించారు.









- యుద్ధప్రాతిపాదికన రంగంలోకి అధికారగణం
- దిశానిర్దేశంతో కఠిన పరిస్థితులపై పట్టు
- తీవ్రతను అర్థం చేసుకుని అన్ని వ్యవస్థలతో సమన్వయం
- మంటలను ఆర్పేందుకు త్వరితగతిన చర్యలు
- వీఐపీలకు వివరాలు అందజేయడంలో కృషి
- గల్లంతైన కార్మికుల కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు
- మరణించిన వారిని గుర్తించెందుకు ప్రత్యేక విభాగం
- అంత్యక్రియలకు ఏర్పాట్లు
- బాధిత కుటుంబాలకు షెల్టర్
- తక్షణ ఆర్థిక సాయం అందజేత
- నష్టపరిహారం చెల్లింపు దిశగా అడుగులు
- పక్షం రోజుల్లోనే మన్ననలు పొందిన కలెక్టర్ ప్రావీణ్య
- ఒత్తిడిలోనూ సంయమనం కోల్పోని అధికారిగా గుర్తింపు



### మధ్యాహ్నానికి మంటలు అదుపులోకి..

దాదాపు పదికి పైగా ఫైర్ ఇంజన్లు ఫైర్ ఫైటర్ వ్యవస్థలు వాడి మంటలను అదుపులోకి తెచ్చాయి. మధ్యాహ్నం లోపు మంటలు అదుపులోకి రావడంతో సహాయక కార్యక్రమాలు వేగవంతం అయ్యాయి. బయటపడ్డాక క్షతగాత్ర ులలను, కాలిపోయిన వారిని అంబులెన్సులు వాడి నగరంలోని పటాన్చెరువు లోని పలు పైవేట్ దవాఖానాలకు చికిత్స నిమిత్తం తరలించేలా చర్యలు తీసుకున్నారు. సహాయక చర్యలు హుటాహుటిన ప్రారంభించి ఎన్డీఆర్ఎఫ్, రెస్క్యూ ఫోర్స్ టీం, ఎస్ జి ఆర్ ఎఫ్, డిడిఆర్ఎస్, ఫోరెనిక్స్ ల్యాబ్ నుంచి ప్రత్యేక బృందాలను రప్పించారు. వీరందరూ కూలిన శిథిలాల కింద ఉన్న కార్మికులను, సిబ్బందిని కాపాడేందుకు హుటాహుటిన పనులు ప్రారంభించారు. రెస్క్యూ బృందాలు పలువురు కార్మికులను సిబ్బందిని కాపాడడంతో వారిని అంబులెన్సుల్లో పలు ఆసుపత్రులకు పంపించారు. అదే సమయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ వచ్చి పరిస్థితులను అర్థం చేసుకొని ప్రభుత్వంతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన వివిధ రకాల సేవా కార్యక్రమాలను, రెస్కీ ఆపరేషన్లను ప్రారంభించారు. హైడ్రాను రప్పించి పరిశ్రమలో కార్మికులను కాపాడేందుకు కృషి చేశారు. అదే సమయంలో తమ వారి ఆచూకీ కోసం పెద్ద ఎత్తున ప్రజలు పరిశ్రమ వద్దకు చేరుకోవడంతో పెద్ద గందరగోళం ఏర్పడింది. అప్పుడే జిల్లా కలెక్టర్ స్పందించి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి మిస్సైన వ్యక్తుల వివరాలను అందజేసేలా పలు శాఖల అధికారులను అక్కడ పెట్టారు. రాత్రంతా రెస్క్యూ బృందాలు శిథిలాల కింద ఉన్న కార్మికుల మృత దేహాలను, సిబ్బందిని వెలికి తీసే ప్రక్రియలో ఉండిపోయారు. కలెక్టర్ సంఘటన స్థలంలోనే ఉండి అన్ని శాఖలను సమన్వయం చేశారు.







### అన్ని శాఖల సమన్వయం..

సిగాచీ ప్రమాదంలో జిల్లా కలెక్టర్ అన్ని శాఖలను సమన్వయం చేసి రంగం లోకి దించారు. పోలీసు శాఖ శాంతి భద్రతలను కాపాడడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అనేగా విధాలుగా అన్ని శాఖ ల అధికారులకు అండగా నిలిచారు. నాలుగు రోజులకి పరిస్థితి పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చింది. మిస్సింగ్ అయిన వ్యక్తు లను డిఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించే ప్రయత్నం చేయిస్తున్నారు. నష్టపరిహారం చెల్లింపు కోసం అధికారులు జాబితా తయారు చేస్తున్నారు. జాబితా తయారీలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. శుక్రవారం రోజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు వచ్చారు. సీఎస్ ఆధ్వర్యంలో హై లెవెల్ కమిటీని ప్రభు త్వం నియమించి పాశమైలారంకు పం పించింది. సిఎస్ బృందానికి కలెక్టర్ ప్రావీణ్య పూర్తి వివరాలు అందజేశారు. బాధిత కుటుంబాలతో మాట్లాడించారు. ఈ సందర్భంగా బాదిత కుటుంబాలు తమ అనుమానాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాటిని కలెక్టర్ సీఎస్ దృష్టికి తీసుకువచ్చి అనుమానాలను నివృ త్తి చేశారు. బాధిత కుటుంబాలు ఇప్పుడు డీఎన్ఏ రిపోర్టుల కోసం వేచి ఉన్నాయి. రోజురోజుకు డిఎన్ఏ రిపోర్ట్లు వస్తుండడంతో బాధితులు తమ వారి మృతదేహాలను స్వగ్రామాలకి తరలించుకుని పోతున్నా రు. జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులకు ఇచ్చిన సూచనలు సక్సెస్ కావడంతోనే ఇంతటి విపత్తును ధైర్యంగా ఎదుర్కొన్నట్టుగా ప్రశంసలు వస్తున్నాయి. కలెక్టర్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ అన్ని శాఖల అధికారులు ఆహోరాత్రులు పనిచేసే జిల్లాకు గుర్తింపు తెచ్చా రు. సిగాచి పేలుడు ప్రమాదాన్ని సమర్థ వంతంగా ఎదుర్కొన్న బృందంగా ప్రావీణ్య బృందానికి గుర్తింపు ఉండిపోతుంది.

### కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి రాక

సిగాచీ పరిశ్రమలో జరిగిన భారీ పేలుడులో పెద్ద ఎత్తున కార్మికులు మరణించడంతో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు ప్రధాని మోడీ ఈ విషాదంపై దిగ్భ్రాంతిని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తరపున ప్రతి మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ. 2 లక్షలు ఇస్తామన్నారు. ప్రమాదస్థలికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని పంపించారు. కలెక్టర్ ప్రావీణ్య కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ప్రమాదం జరిగిన విధానం, నష్టము, ఎంతమంది కార్మికులు మరణించారు, ఎంతమంది క్షతగాత్రులు ఉన్నారు, ఎంతమంది మిస్సింగ్ అయ్యారు వివరాలు అందజేశారు.



### సీఎం పర్యటనలో వివరాలు అందిస్తూ..

సిగాచి పరిశ్రమలో ప్రమాదం సంచలనంగా మారడం..పెద్ద స్థాయిలో కార్మికులు మరణించడం, క్షతగాత్రులుగా వివిధ ఆ సుపత్రుల్లో చికిత్స పొందుతూ ఉండడంతో సీఎం రేవంత్ రెడ్డి వారిని పరామర్శించేందుకు వచ్చారు. అనంతరం సిగాచీ పరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భం గా పరిశ్రమలో అగ్ని ప్రమాదం ఎలా సంభవించింది.. క్షతగాత్రుల వివరాలు, మిస్సింగ్ అయిన వారి వివరాలను కలెక్టర్ సీఎం కు వివరించారు. స్పందించిన సీఎం తక్షణ ఆర్థిక సహాయంతో పాటు మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వ సహాయంతో పాటు పరిశ్రమ యజమాన్యంతో మాట్లాడి నష్ట పరిహారం ఇప్పించేందుకు హామీ ఇచ్చారు. ఇలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా హై లెవెల్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఆ కమిటీకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వ ర్యంలో విచారణ నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. సిఎం రాకతో పరిశ్రమ ప్రమా దంలో మరణించిన కుటుంబాలకు ధీమా, గాయపడ్డ వ్యక్తులకు వైద్యం సహాయం అందేలా హామీ లభించింది. ఈ విష యంలో జిల్లా కలెక్టర్‌గా ప్రావీణ్య అందిం చిన చొరవను అభినందించారు.

### డిఎన్ఏ పరీక్షలతో మృత దేహాల గుర్తింపు..

సిగాచీ ప్రమాదంలో 40 మంది కార్మికు లు ఈ ప్రమాదంలో మరణించినట్టుగా అధికారికంగా ప్రకటించారు. వీటిలో సగం మృతదేహాలు ఎవరివో అర్థం కానంత స్థాయిలో కాలిపోయాయి. కాలిన మృతదేహాలు ఎవరివో గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అందజేసేందుకు కలెక్టరు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వైద్య నిపుణులను రంగంలోకి దించి డిఎన్ఏ టెస్ట్ ద్వారా మృతదేహాలను గుర్తించే ఏర్పాటు చేశారు. ఈ విధానం ద్వారా ఇప్పటికే సగం మంది డిఎన్ఏ టెస్టులు పూర్తి చేసి వారి తాలూకు వ్యక్తులకు మృతదేహాలను అప్పగించారు. యూపీ, బీహార్, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన కార్మికుల మృతదేహాలను తీసుకువెళ్తామంటే వాహనాలను సైతం అందుబాటులోకి తీసుకువచ్చారు. మరోపక్క అంత దూరం తీసుకెళ్లి దహన సంస్కారాలు చేయలేని వారికి స్థానికంగా ఇస్నాపూర్ లోని వైకుంఠధామంలో దహన సంస్కారాలు చేసేలా ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్ వద్ద మిస్సింగ్ అయిన వ్యక్తుల వివరాలు, చనిపోయిన వ్యక్తుల వివరాలు, వైద్య చికిత్స పొందుతున్న వ్యక్తుల వివరాలు అందుబాటులోకి తెచ్చి సహాయం అందేలా చూశారు. ప్రత్యేక బస కల్పించి వారు అక్కడ ఉండేలా చూశారు.

